# ఆంధ్రప్రదేశ్ శాసన మండలి

# ప్రసంగం

# శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్

## ఆంధ్రప్రదేశ్ గవర్నరు

ఫాల్గుణ బ.2, 1936

7 మార్చి, 2015

**మాన్యశ్రీ అధ్యక్షా,**

**సభాపతి మహాశయా,**

**గౌరవనీయులైన శాసనమండలి సభ్యులారా !**

2015-16 బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మీ అందరికీ నా శుభాకాంక్షలు.

జూన్, 2014 నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలిలో నేను చేసిన ప్రసంగాన్ని దయచేసి గుర్తుకు తెచ్చుకోవలసిందిగా సభ్యులను కోరుతున్నాను. ఆ ప్రసంగంలో మునుపటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా, హడావిడిగా విభజించినందువల్ల ఏర్పడిన కొన్ని కీలక అంశాలను, ఆ తదుపరి ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను విపులంగా తెలియజేసినాను. ఆదాయ సముపార్జన, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య, విద్యా సంస్థలు ఆర్&డి, శిక్షణా సదుపాయాలు, సామాజిక మౌలిక సదుపాయాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కోసం 2014, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో చేసిన నిబంధనలు ఆంధ్రప్రదేశ్ ప్రజలు

కోల్పోయిన అవకాశాలను భర్తీ చేసేందుకు తగినంతగా లేవు. భాగస్వాములందరి ప్రమేయం లేకుండా, రాజధాని నగరాన్ని కూడా ఖరారు చేయకుండా రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకోవడం, తప్పనిసరి ఇబ్బందులకు గురిచేసింది. మునుపటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జనాభాలో 58.32 శాతం మంది వున్న నూతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజనానంతర అంశాలు ముఖ్యంగా భారీ ఆర్థిక లోటు నిరంతరంగా వెంటాడుతున్నాయి.

వివిధ రకాల లోటులతో అత్యంత క్లిష్ట పరిస్థితులలో నా ప్రభుత్వం అధికారాన్ని చేపట్టింది. ఈ ఇబ్బందులకు అదనంగా హుద్‌హుద్ తుఫాను, అనావృష్టి ప్రభావాలు కష్టాలను పెంచాయి. ఈ 9 నెలలలో ఇబ్బందులను అధిగమించడమే కాకుండా, సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోవడానికి "సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్" కు గట్టి పునాది వేసేందుకు కూడా అన్ని చర్యలను నా ప్రభుత్వం చేపట్టింది.

1) రెవెన్యూ లోటును భర్తీ చేయడం, 2) పారిశ్రామిక ప్రోత్సాహకాలు, 3) 7 జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి, 4) రాష్ట్ర రాజధాని అభివృద్ధి కోసం

సహాయం, 5) రాష్ట్రానికి రైల్వే జోను, 6) ప్రత్యేక కేటగిరీ హోదా వంటి వాటితోపాటు అనేక అంశాలలో మన రాష్ట్రానికి మద్దతిస్తూ రాజ్యసభలో అప్పటి ప్రధానమంత్రిగారు చేసిన ప్రసంగం, 2014, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని సభ్యులు దయచేసి గుర్తుతెచ్చుకోనగును.

ఈ కొద్ది నెలలలో కేంద్రం నుండి మరింత సానుకూల మద్దతును ప్రభుత్వం ఆశించింది. అయితే, చాలా అనుకూల స్పందన ఇంకా అందవలసి వుంది. గౌరవ ప్రధానమంత్రిగారు తుఫాను బాధిత ప్రాంతాలను సందర్శించిన సమయంలో రాష్ట్రానికి రూ.1000 కోట్ల మొత్తం సహాయాన్ని ప్రకటించిన దానిలో భాగంగా హుద్‌హుద్ తుఫాను క్రింద బాధిత జిల్లాలకు రూ. 650 కోట్ల ఆర్థిక సహాయాన్ని విడుదల చేసింది. అదేవిధంగా, రాష్ట్రంలోని ఏడు వెనుకబడిన జిల్లాల కోసం ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి క్రింద రూ. 350 కోట్లు, ప్రణాళికేతర రెవెన్యూ లోటు నిమిత్తం తాత్కాలిక, ఆర్థిక సహాయంగా రూ. 500 కోట్లు మంజూరు అయ్యాయి.

తగినంత మద్ధతు కోసం విజ్ఞప్తులు చేసుకున్నప్పటికీ, 14వ ఆర్థిక సంఘు సిఫారసులు రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యత ఏమీ ఇవ్వలేదు. 2015-16 కేంద్ర బడ్జెటులో రాష్ట్రానికి మేము ఆశించిన విధంగా జరగలేదు.

విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రధాన వనరులను పోగొట్టుకుంది. రెవెన్యూ మిగులు ఉన్న ఇరుగుపొరుగు రాష్ట్రాలతో పోటీ పడటానికి ఇది హానికలిగిస్తుంది. ఇవి రాష్ట్రం తనంతతానుగా ఎదగలేని విధమైన పరిస్థితులకు దారితీశాయి. ఇరుగుపొరుగు రాష్ట్రాలలోని బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు వంటి అభివృద్ధి చెందిన నగరాలతో పోటీపడాలంటే, ఇరుగుపొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయిలో ఉండటానికి గాను కేంద్రం కావలసినంత ఆర్థిక సహాయాన్ని అందజేయాలి. ఇందుకోసం మా కేసును గట్టిగా ముందుకు తీసుకువెళ్లడానికిగాను గౌరవ ప్రధానమంత్రిగారిని, కేంద్ర ఆర్థిక మంత్రిగారిని, తదితర మంత్రులను కలవడంలో ప్రతి అవకాశాన్ని వినియోగించుకున్నాం.

మీ అందరికీ తెలిసినట్లుగా ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ అభివృద్ధి అజెండాను ముందుకు తెచ్చేందుకు నా ప్రభుత్వం నిరంతరంగా ప్రయత్నాలు చేస్తున్నది. ప్రభుత్వ విధానాలు,

కార్యక్రమాల సార్థకత్వం, సమాజంలోని నిరుపేద, బడుగు వర్గాలకు వాటిని అందించడం ద్వారా సమ్మిళిత వృద్ధిని సాధించాలని యోచిస్తున్నాం.

మా ప్రయత్నంలో సమానత్వం గల వృద్ధి వుండేలా చూడడం ప్రధాన అజెండాగా వుంది. నా ప్రభుత్వం విజన్ 2050 డాక్యుమెంటును రూపొందించడాన్ని ప్రారంభించింది. వినూత్న వృద్ధి వాతావరణం వల్ల ఏర్పడే అవకాశాలను ఉపయోగించుకుంటూ నూతన అభివృద్ధి ప్రక్రియ కోసం ప్రమాణాలను ఏర్పాటు చేయడాన్ని ఈ డాక్యుమెంటు సూచిస్తుంది. 2022 నాటికి భారతదేశంలో అత్యంత పనితీరు ప్రదర్శించే మొదటి మూడు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్‌ను ఒకటిగా చేసి 2029 నాటికి దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దాలనేది మా విజన్ అని గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో నేను పేర్కొన్న విషయాన్ని సభ్యులు గుర్తుకు తెచ్చుకోగలరు. పేదరిక నిర్మూలన, ఆర్థిక అసమానతలను తగ్గించడం, మన సొసైటీని ఆరోగ్యకరంగాను, ఆహ్లాదకరంగాను, పరిశుభ్రంగాను ఉంచడానికిగాను నా ప్రభుత్వం నిబద్ధత కలిగివుంది.

అభివృద్ధి పథంలో ప్రజలను భాగస్వామ్యులుగా చేయడం, వారి ముంగిటకు ప్రభుత్వాన్ని తేవడాన్ని నా ప్రభుత్వం దృఢంగా విశ్వసిస్తున్నది. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలోనైనా సమర్ధవంతమైన పరిపాలనకు ఇది అత్యంత ముఖ్యమైన అంశం.

గత జన్మభూమి కార్యక్రమాలలో అందిన ప్రేరణతో నా ప్రభుత్వం 2014, అక్టోబరులో జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్పందన చాలా ప్రోత్సాహకరంగా వుంది. 24 ప్రధాన సామాజిక సూచికలపై ఈ ప్రజా కేంద్రీకృత చర్య ద్వారా లభ్యమైన ప్రధాన అనుబంధ ఉత్పాదకత సూక్ష్మ ప్రణాళిక డేటాగా ఉంది. ఈ సూచికల క్రింద ముఖ్యంగా ఆరోగ్య సంబంధిత ప్రగతిపై కాలానుగుణ పర్యవేక్షణ సత్ఫలితాలను ఇస్తుంది.

ఈ ఆలోచనలతో సమానంగా జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ప్రాతిపదికతో రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలు, వార్డులలో నా ప్రభుత్వం "స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ దిశగా స్మార్ట్ విలేజ్ - స్మార్ట్ వార్డ్" అనే కొత్త భాగస్వామ్య అభివృద్ధి చర్యను చేపట్టింది. 20 బదలాయించదగని అభివృద్ధి నిబద్ధతలననుసరించి ప్రపంచవ్యాప్త ప్రమాణాలను సాధించడం ద్వారా అన్ని గ్రామాలు, వార్డుల మార్పులను "స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ దిశగా స్మార్ట్ విలేజ్ - స్మార్ట్

వార్డ్" ప్రోత్సాహక చర్య ఉద్దేశిస్తుంది. ఈ అభివృద్ధి ప్రయత్నంలో భాగస్వాములు కావడానికి ప్రవాస భారతీయులు, నివాసేతర గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వేతర సంస్థలు, కార్పొరేట్స్, సీనియర్ ప్రభుత్వ అధికారులు మరియు ఇతరుల నుండి వచ్చిన స్పందన ప్రోత్సాహకరంగా ఉంది.

నిజానికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ యొక్క ముఖ్యమైన రంగాల వృద్ధి రేటు ఈ సంవత్సరంలో పూర్తి సంతృప్తికరంగా ఉన్నాయనే విషయాన్ని మీ అందరికీ తెలియజేస్తున్నందుకు నేను నిజంగా సంతోషపడుతున్నాను. ఈ సానుకూల అంశం మరింత మెరుగ్గా సేవలను అందించేందుకు మనలను ప్రేరేపిస్తుంది. స్థూలంగా నా ప్రభుత్వం అమలుచేస్తున్న వృద్ధి అనుకూల విధానాలు లాభాలు అందించడాన్ని ప్రారంభించాయని ఈ పునరుజ్జీవనం సూచిస్తున్నది. ఈ చర్యల సానుకూల ప్రభావం వల్ల ముందస్తు అంచనాల ప్రకారం 2014-15లో రాష్ట్రం 7.21 శాతం వృద్ధిని నమోదు చేసింది. అన్ని మూడు రంగాలు అంటే వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాలు ప్రోత్సాహక అభివృద్ధిని చూపాయి. సమగ్రాభివృద్ధిని సాధించేందుకు గాను, నా ప్రభుత్వం జిల్లావారీ వృద్ధి వ్యూహాలను రూపొందిస్తున్నది.

2004-05 నుండి 2011-12 వరకు జాతీయ ఆర్థిక వ్యవస్థ అంచనాలను సంకలనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆధార సంవత్సరాన్ని సవరించింది. ఆధార సంవత్సరాన్ని 2011-12కు సవరించే వరకు పాత ఆధార సంవత్సరంతో రాష్ట్రాలు అంచనాలను తయారు చేయడం కొనసాగిస్తాయి. ఇందుకు రెండు నెలల సమయం పడుతుంది. కొత్త ఆధార సంవత్సరంతో 2014-15 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ వృద్ధిరేటు 1.2 శాతానికి పైగా మరింత పెరిగే అవకాశం ఉంది. ఆ విధంగా జాతీయ సగటు రేటు 7.4 శాతం కంటే 1 శాతం అంతకుపైబడి మించగలదు.

36.34 శాతం వర్షపాతం లోటుతో తీవ్ర అనావృష్టి వున్నప్పటికీ, 2014-15లో 5.90 శాతం వృద్ధిరేటుతో వ్యవసాయ రంగం, 5.25 శాతం వృద్ధిరేటుతో పరిశ్రమల రంగం మనకు కొంత ఊరటను కలిగించాయి. రాష్ట్రంలో పూర్తి సామర్థ్యం గల మత్స్య పరిశ్రమ ఉప రంగం వృద్ధి 17.3 శాతానికి పెరిగింది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన "భారత్‌లో తయారీ" స్ఫూర్తికి అనుగుణంగా తయారీ ఉప రంగం తగిన పనితీరును చూపాయి. ప్రధాన వాటాదారుగా కొనసాగిన సేవల రంగం 8.48 శాతం వృద్ధిని నమోదు చేసింది. జీవన ప్రమాణాలలో స్పష్టమైన మెరుగుదల వల్ల

ప్రస్తుతం రూ. 90,517/-ల సంతృప్తి స్థాయిలో వున్న ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయం ఇంకనూ వేగంగా పెరుగుతుందని ఆశించడమయింది.

అయితే, దీర్ఘకాల వృద్ధి అజెండాతో రాబోయే సంవత్సరాలలో అధిక వృద్ధిరేటును సాధించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాల్సిన అవసరముంది. నిజానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండంకెల వృద్ధిని ఉద్దేశిస్తున్నది. ఆర్థిక వ్యవస్థలోని వ్యవసాయం, పరిశ్రమ, సేవల రంగాలలో వ్యాపించి వున్న 40 వృద్ధి వాహకాలను గుర్తించింది. ఇవి రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 80 శాతాన్ని కలిగివున్నాయి. గుర్తించిన కీలక వృద్ధి వాహకాలను వ్యవసాయానికి సంబంధించిన వరి, మొక్కజొన్న, వేరుశనగ, ఉద్యానవనానికి సంబంధించిన మిరప, అరటి, మామిడి, పశుగణానికి సంబంధించి పాలు, మాంసం, గుడ్లు, మత్స్య రంగానికి సంబంధించి సముద్ర, లోతట్టు ప్రాంతాల రొయ్యలు, చేపలు చేరివున్నాయి. ఇవి విలువ చేర్పులో మంచి పురోగతిని నమోదు చేయగలవని ఆశించడమయింది.

నా ప్రభుత్వం సూక్ష్మ ప్రణాళికను, విధాన రూపకల్పనను మరింత ఉపయుక్తంగా చేసేందుకు, మండల డొమెస్టిక్ ఉత్పత్తిని

సంకలనం చేయడాన్ని చేపట్టింది. ఈ ప్రక్రియ ప్రయోగాత్మకంగా చేపట్టిన తూర్పు గోదావరి, అనంతపురము రెండు జిల్లాలలో విజయవంతమయింది.

సమగ్ర దీర్ఘకాల అభివృద్ధి వ్యూహంలో భాగంగా, లక్ష్య సాధన ఆధారిత విధానం ద్వారా వనరుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడం కోసం ప్రాథమిక సామాజిక ఆర్థిక మౌలిక సదుపాయాలను కల్పించేందుకు గుర్తించిన రంగాలలో వృద్ధి అంశాలపై దృష్టి పెట్టేందుకు ప్రణాళికలు ఉన్నాయి. సంబంధితులందరికీ భాగస్వామ్యాన్ని కల్పిస్తూ ఏడు మిషన్లు అంటే ప్రాథమిక రంగం, సామాజిక సాధికారత, పరిజ్ఞాన, నైపుణ్య అభివృద్ధి, పట్టణాభివృద్ధి, పరిశ్రమ రంగం, మౌలిక సదుపాయాలు, సేవల రంగ మిషన్‌లు శీఘ్ర వృద్ధికి పునాది వేస్తాయి. ఇప్పటికే రెండు మిషన్లు అంటే; ప్రాథమిక రంగ మిషన్, సామాజిక సాధికారత మిషన్‌ను ప్రారంభించడమయింది. ఇతర మిషన్లను త్వరలో ప్రారంభిస్తాం.

నా ప్రభుత్వం ప్రారంభించిన అయిదు ప్రచార విధానాలు అంటే - పేదరికంపై గెలుపు, పొలం పిలుస్తోంది, బడి పిలుస్తోంది, నీరు-చెట్టు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ విధానాలు స్వయం సహాయక

బృందాల సామర్థ్యాన్ని వినియోగించుకోవడంలో మరియు ఉపాధికల్పన, అవగాహన కల్పనకు, నీటి వినియోగ సమర్థతను మెరుగుపరచడానికి, పౌరులకు పరిశుభ్రతను అలవరచడానికి ముఖ్యమైన ప్రభావం చూపుతున్నాయి. 2015, ఫిబ్రవరి 19వ తేదీన చిత్తూరు జిల్లాలోని తంబాలపల్లె గ్రామం నుండి ప్రారంభించిన నీరు - చెట్టు కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణ కోసం సత్వర చర్యలు తీసుకున్నాం. భూగర్భజల మట్టాల మెరుగుదల 5 సంవత్సరాలలో రాష్ట్రాన్ని అనావృష్టిరహితంగా చేస్తుంది.

మహాత్మాగాంధీ 150వ జయంతిని గుర్తుచేసుకుంటూ 2019, అక్టోబరు 2వ తేదీనాటికి "స్వచ్ఛ భారత్" విజన్‌ను సాధించేందుకు ఉద్దేశించిన కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్ కార్యక్రమం రాష్ట్రంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రయత్నం కోసం కీలక ప్రేరణగా కొనసాగుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి స్థాయిలు అసమానంగా వున్నాయని గౌరవ సభ్యులకు తెలుసు. రాయలసీమ ప్రాంతంలో ఖనిజాలు, ఇతర సహజ వనరులు సమృద్ధిగా వున్నప్పటికీ శతాబ్దాలుగా వెనుకబడిన ప్రాంతంగా వుంది. భూగర్భ జలాల స్థాయిలు అధికంగా క్షీణించడంలో బోరుబావులు తరచుగా

ఎండిపోతున్నాయి. త్రాగునీరు, సాగునీటి ప్రయోజనాలకు నీరు అతి పెద్ద సమస్యగా వుంటున్నది. గోదావరి జిల్లాలలోని రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణానదికి మళ్లిస్తూ వినియోగించడానికి నా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. తద్వారా రాయలసీమ ప్రాంతంలోని అనావృష్టి బాధిత ప్రాంతాల ప్రజలకు హంద్రీ-నీవా, గాలేరు-నగరి, ఇతర ప్రాజెక్టుల ద్వారా గణనీయ పరిమాణంలో సహాయపడవచ్చు. నదుల అనుసంధానం ప్రస్తుతం జాతీయ ప్రాధాన్యతగా వుంది. రాయలసీమలో నీటి మట్టాల రీఛార్జి, పూర్తి నిల్వ సామర్ధ్యానికి రిజర్వాయర్లను భర్తీ చేయడమే నా ప్రభుత్వ ప్రాధాన్యత.

ప్రతి నీటి బొట్టును పరిరక్షించడానికి సమర్థ నీటి వినియోగానికి నా ప్రభుత్వం కట్టుబడి వుంది. తక్కువ నీటిని వినియోగిస్తూ ముఖ్యంగా రాయలసీయ అనావృష్టి పీడిత ప్రాంతాలలో ఉత్పాదకతను పెంచడం కోసం బిందు, తుంపర సేద్యం విధానాలను వేగవంతం చేయడమవుతుంది. భూసార పరీక్షల ఆధారంగా ఉత్పాదకతను పెంచడం కోసం మైక్రో న్యూట్రియంట్లను శాస్త్రీయంగా వినియోగించడమవుతుంది. ఆధునిక టెక్నాలజీలు, అధిక దిగుబడి రకం విత్తనాలతో ఉద్యానవన పంటలు, వాణిజ్య

పంటలకు ఆవశ్యక ప్రాధాన్యత ఇవ్వడమవుతుంది. సంతులిత అభివృద్ధి ఉండేటట్లు చూడటానికి ఈ ప్రాంతాలలో ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు, సిమెంటు, ఖనిజ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడమవుతుంది. రుతుపవనాల వైఫల్యంవల్ల సంవత్సరం పొడవునా ప్రభావితమయ్యే రాయలసీమ జిల్లాలకు మామూలుగా, అనంతపురము మరియు చిత్తూరు జిల్లాలకు ప్రత్యేకంగా సత్వర, అధిక శ్రద్ధ అవసరమవుతుంది. ఈ రెండు జిల్లాలలో భూగర్భ జల మట్టాలు 1300 నుండి 1400 అడుగులకు అసాధారణంగా స్వల్ప స్థాయిలకు పడిపోయాయి. రాయలసీమ, ఉత్తర కోస్తా ఆంధ్రా జిల్లాలను అభివృద్ధి ఛత్రం ప్రధాన పరిధిలోకి తేవడానికి నా ప్రభుత్వం సాధ్యమైన చర్యలన్నింటిని చేపడుతుంది. నూతన రాజధాని నుండి ఈ జిల్లాలకు రోడ్డు అనుసంధానాన్ని ఏర్పాటు చేయడమవుతుంది.

రైతు దేశానికి వెన్నెముక అని నా ప్రభుత్వం విశ్వసిస్తున్నది. నా ఆందోళన వ్యవసాయ రంగాన్ని పునరుద్ధరిస్తూ, రైతులకు దోహదపడే అంశం చుట్టూ కేంద్రీకృతమైంది. అనేక సంక్షోభాలకు గురైన వ్యవసాయ రంగం లక్షలాది రైతు కుటుంబాలకు మద్ధతునిస్తూ ప్రధాన ఉపాధికల్పన వనరుగా ఉంది. నా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రాథమిక రంగ మిషన్ ఉద్యానవన, పశుగణ, మత్స్య

పరిశ్రమ నుండి విలువ చేర్పును పెంచడం, శీతల గిడ్డంగులతో సహా స్టోరేజి స్థలంలో తగ్గుదలలు వంటి క్షేత్ర సంబంధిత అంశాలను పరిష్కరిస్తుంది.

దేశంలోనే గరిష్టంగా, రాష్ట్రంలోని 93 శాతం మంది రైతులు అప్పుల ఊబిలో ఉన్నారని తాజా ఎన్ఎస్ఎస్ఓ సర్వే తెలియజేస్తున్నది. ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ "రైతుల సాధికారత సంస్థ" ద్వారా పంట రుణాలకు సంబంధించి రుణ మాఫీ పథకాన్ని అమలుపరచడానికి మేము కట్టుబడి ఉన్నాం. రాష్ట్రంలోని అర్హులైన రైతులకు రూ. 5000 కోట్లు మేరకు సహాయం అందిస్తూ పథకం మొదటి దశను పూర్తి చేసిన మీదట రెండవ దశ లబ్దిదారు రైతులను మేము ఖరారు చేస్తున్నాం. రెండు దశలలో కలిపి అతిపెద్ద రుణ మాఫీ ద్వారా మిలియన్ల మంది రైతులు ప్రయోజనం పొందుతారు. రుణవలయం నుండి వారికి విముక్తి కల్పించడానికి ఉద్యానవన పంటల రైతులకు ఎకరా ఒక్కింటికి రూ. 10,000/-ల సహాయాన్ని సమకూర్చడమయింది.

2014-15 ఖరీఫ్, రబీ సీజన్లలో నెలకొన్న ప్రతికూల వర్షపాత పరిస్థితి నాట్లువేసే ప్రాంతాలను ప్రభావితం చేసింది. ఫలితంగా, 111 లక్షల టన్నులు ఉంటుందని ఉద్దేశించిన ఆహార ధాన్యాల ఉత్పత్తి గత

సంవత్సర ఉత్పత్తిలో 4.7 శాతానికి తగ్గింది. నూనె గింజల ఉత్పత్తి కూడా క్షీణించింది.

అంశాలను పారదర్శక, జవాబుదారీతనంగా రూపొందించడ్డానికి, రైతులకు సహాయపడటానికి ఆర్‌టిజిఎస్ / అకౌంట్ పేయీ చెక్కుల ద్వారా మాత్రమే 1.37 లక్షల రైతుల నుండి కనీస మద్ధతు ధరకు రూ. 2219 కోట్ల విలువ గల 16.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడమయింది.

దళారుల ప్రమేయాన్ని తగ్గించడానికి ఇ-మార్కెటింగ్ ప్రవేశపెట్టడ మవుతున్నది. ఈ ప్రక్రియ ద్వారా, రైతులు, ఫుడ్ ప్రాసెసర్స్, రీటెయిలర్ల మధ్య అనుసంధానాన్ని మెరుగుపర్చే నెట్‌వర్కింగ్ మార్కెట్లలో ఎలక్ట్రానిక్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయడమవుతుంది.

నా ప్రభుత్వం నష్టపరిహార మొత్తం రూ.1.50 లక్షల నుండి 3 రెట్లకు పైగా అంటే, రూ. 5.00 లక్షల వరకు పెంచడం ద్వారా ఎవరైతే ఆత్మహత్యలు చేసుకున్నారో అట్టివారి కుటుంబ సభ్యులకు సహాయాన్ని విస్తరింపచేయడమయింది. ఇందులో రైతు కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా క్రింద రూ. 3.50 లక్షలు, అప్పులు ఇచ్చిన వారికి బాకీ తీర్చే నిమిత్తం రూ. 1.50 లక్షలు చేరి వుంది.

దాదాపు 46 లక్షల రైతు కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తూ 291 లక్షల పశుగణం, 815 లక్షల కోళ్ల పరిశ్రమతో రాష్ట్రం గొప్ప పశుగణ వనరులను కలిగివుంది. పశుగణ రంగం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు దాదాపుగా 6.5 శాతం వాటానందిస్తూ 2013-14లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ. 33,600 కోట్ల మొత్తాన్ని చేర్చింది. దేశంలో ఉత్పత్తి అయిన ప్రతి అయిదు గుడ్లలో ఒక గుడ్డును రాష్ట్రం ఉత్పత్తి చేస్తూ గుడ్డు ఉత్పత్తిలో రెండవ స్థానాన్ని ఆక్రమించింది. 4.89 లక్షల మెట్రిక్ టన్నుల మాంసాన్ని, 90.83 లక్షల మెట్రిక్ టన్నుల పాలను ఉత్పత్తి చేస్తూ అతి పెద్ద ఉత్పత్తిదారులలో రాష్ట్రం కూడా ఒకటిగా వుంది.

ఆంధ్రప్రదేశ్ శీఘ్ర సామాజిక, ఆర్థిక పరిణామం కోసం మత్స్య పరిశ్రమ రంగాన్ని వృద్ధి కారకాలలో ఒకటిగా గుర్తించడమయింది. 947 కి.మీ.ల అతి పెద్ద కోస్తా తీరం, ముమ్మర ఉప్పునీటి సామర్థ్యం, ఉత్పాదక దేశీయ జలాశయాలు, కుంటలు, చెరువులు, రిజర్వాయర్లు, నదులు, సరస్సులు వంటి అపారమైన వనరులను రాష్ట్రం కలిగివుంది. మత్స్య పరిశ్రమ రంగం రాష్ట్ర జిడిపికి 5.42 శాతంవాటాను అందిస్తున్నది. చేపలు / రొయ్యల మొత్తం ఉత్పత్తిలో మరియు భారతదేశంలో ఉత్పత్తి చేసిన చేపలు / రొయ్యల విలువలో ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో మొదటి స్థానంలో నిలిచింది.

ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ ఆక్వాకల్చర్ రాజధానిగా, దేశంలో సముద్రరంగ ప్రాసెసింగ్ హబ్‌గా చేయాలని నా ప్రభుత్వం యోచిస్తున్నది. ప్రాసెసింగ్ సామర్థ్యం, విలువ చేర్పు, అత్యధిక సముద్ర ఆహార ఎగుమతుల విషయంలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో ఉంచాలని నా ప్రభుత్వం భావిస్తున్నది.

వ్యవసాయం కోసం ఆవశ్యక ఆధారంగావున్న సాగునీటికి ఈ సంవత్సరంలో కూడా ప్రాధాన్యతను ఇవ్వడమవుతుంది. దీనికి అదనంగా, సాగు విస్తీర్ణాన్ని పెంచడం కోసం నీటి వినియోగ సమర్థతను పెంచడమే మా ప్రాధాన్యత.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణాధారమైనట్టి పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా కేంద్రం ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర అధికారులు సభ్యులుగావున్న పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పిపిఏ) అవసరమైన అనుమతులన్నింటినీ చూస్తుంది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు కోసం రూ. 100 కోట్ల స్వల్ప మొత్తాన్ని కేటాయించడం మా ప్రణాళికలకు భంగం వాటిల్లింది. ఈ ప్రాజెక్టు కోసం కేంద్ర బడ్జెటులో చేసిన కొద్దిపాటి కేటాయింపుకు నిరుత్సాహపడకుండా 2018, మార్చి నాటికి ఈ డ్రీమ్ ప్రాజెక్టును పూర్తి చేయడానికి మేము అన్నివిధాలా కృషి చేస్తాం.

ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేయాలని 6 సాగునీటి ప్రాజెక్టులను అంటే పట్టిసీమ ఎత్తిపోతల పథకం, తాటిపూడి, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, వెలిగొండ, వంశధార ప్రాజెక్టులను నా ప్రభుత్వం గుర్తించింది. ఇతర ప్రాజెక్టులను కూడా నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయడమవుతుంది.

నా ప్రభుత్వం పేదల పక్షానే వుండి వారి అభ్యున్నతి కోసం చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోవడాన్ని కొనసాగిస్తుంది. ఈ అంశంలో, "ఎన్‌టిఆర్ భరోసా" పథకం క్రింద నాలుగురెట్ల మేరకు సంక్షేమ పింఛనుల మొత్తాన్ని పెంచాము. నెలవారీ పింఛనును అనాథ మహిళలకు, వృద్ధులకు రూ. 200/-ల నుండి రూ. 1000/-లకు పెంచడమయింది. వికలాంగులకు సంబంధించి నెలవారీ పింఛనును రూ. 1500/-లకు పెంచడమయింది. మేము మరో లక్ష మంది అర్హులైన వారికి కూడా పింఛనును ఇవ్వాలని ఉద్దేశిస్తున్నాము. నా ప్రభుత్వం కేవలం సంక్షేమ పింఛనులపై రాబోయే సంవత్సరాలలో దాదాపు రూ. 25,000 కోట్లను ఖర్చు పెట్టడానికి కట్టుబడి వుంది. కొన్ని దుర్బల గిరిజన తెగలకు సంబంధించి పింఛను ప్రయోజనాలను పొందడం కోసం వయోపరిమితిని 65 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలకు తగ్గించడమయింది.

ఆధార్ ప్రమాణీకరణతో మళ్లింపు లేకుండా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందేలా చూడటానికి 750 తెల్లరేషన్ కార్డుల కంటే ఎక్కువ కలిగివుండి గుర్తించిన అధిక సామర్థ్యం గల 6000 చౌకధరల దుకాణాలలో ఇ-పిఓఎస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ డివైజ్) ను వినియోగిస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థలో టెక్నాలజీ వినియోగాన్ని పటిష్టవంతం చేయడానికి నా ప్రభుత్వం కట్టుబడి వుంది.

ఎస్‌సిల, ఎస్‌టిల, బిసిల, మైనారిటీల, మహిళా సంక్షేమం మా సంక్షేమ అజెండాలో అగ్రభాగాన ఉంది. ప్రజ్ఞావంతులైన ఎస్‌సి, ఎస్‌టి పిల్లల విద్యాపరమైన అవసరాలకు మా "అంబేద్కర్ విద్యా నిధి" శ్రద్ధ తీసుకుంటున్నది. 2015-16 సంవత్సరంలో వృత్తిపరమైన మార్గదర్శకాన్ని ఇవ్వడం కోసం, "ఎన్‌టిఆర్ విద్యోన్నతి" ని అమలు చేసేందుకోసం ఉత్తర్వులను జారీ చేయడమయింది. ఆర్థిక మద్ధతు లేకుండా మంచి పాశ్చాత్య విశ్వవిద్యాలయాలలో పోస్టు-గ్రాడ్యుయేషను లేదా ఏవేని అట్టి కోర్సులను చేయడానికి ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఇప్పుడు అవకాశమున్నది. ఉన్నత విద్యను గరపడం కోసం ఇప్పుడు 10 దేశాలకు వెళ్లే ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ప్రభుత్వం సహాయాన్ని అందిస్తున్నది. పాఠశాలలు,

కళాశాలల విద్యార్థులకు ఆన్‌లైన్ స్కాలర్‌షిప్పులను చెల్లించడం మా అవినీతిరహిత పరిపాలనకు ప్రమాణ చిహ్నంగా ఉంటున్నది. వినియోగ పరిమితి నెల ఒక్కింటికి 50 యూనిట్లకు మించకుండా 4.99 లక్షల ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ఉచిత విద్యుత్తును ఇవ్వడమవుతున్నది. నా ప్రభుత్వం వాస్తవ స్ఫూర్తితో ఎస్‌సి / ఎస్‌టి ఉప-ప్రణాళిక అమలును కట్టుదిట్టం చేస్తున్నది.

34,181 మంది ఎస్‌టి విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ విద్యా స్కాలర్‌షిప్పులను ఇవ్వడమయింది. సామాజిక సాధికారత మిషన్ అమలులో భాగంగా ఎస్‌టి యువత వారి ఉద్యోగ సామర్థ్యత కోసం నైపుణ్యాలను అభివృద్ధి పరిచేందుకు నా ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తున్నది. 2014-15 లో ఇప్పటివరకు 3,172 మంది ఎస్‌టి యువతకు శిక్షణనిచ్చి, ఉద్యోగాలను కల్పించడమయింది.

గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు గారి గౌరవ, మర్యాదలకు గుర్తుగా ప్రతీ సంవత్సరం జులై 4వ తేదీన అల్లూరి సీతారామరాజు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ, 09-08-2014 తేదీని "ప్రపంచ ఆదివాసీ దినోత్సవం"గా ప్రభుత్వం నిర్వహించింది.

2015-16లో, గిరిజన జనాభా సంక్షేమం నిమిత్తం ప్రభుత్వ ప్రాధాన్యతల ఆధారంగా, కొన్ని క్రొత్త కార్యక్రమాలు అంటే, నాణ్యత గల విద్యను అందించడానికి వసతి గృహాలను నైవాసిక పాఠశాలలుగా మార్చడం, త్రాగునీరు మరియు పథకాలకు సంబంధించిన ఇతర ప్రాథమిక మౌలిక సదుపాయాలు గిరిజన బాలికలకు వారి వివాహ సమయానికి రూ. 50,000/-ల సహాయాన్ని అందించడానికి "గిరి పుత్రికా కళ్యాణ పథకం", పారదర్శకతను మెరుగుపరచేందుకు చివరి వరకు కార్యక్రమాల ఆన్‌లైన్ పర్యవేక్షణను పటిష్ఠపరచడం మొదలగువాటిని ప్రతిపాదించడ మయింది.

నా ప్రభుత్వం వెనుకబడిన తరగతుల రాజకీయ, ఆర్థిక, సామాజిక సాధికారతకు దృఢంగా కట్టుబడి వుంది. ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాలకు అనుగుణంగా వెనుకబడిన తరగతుల ప్రజలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా పథకాలను అమలు చేస్తాము. మా బిసి డిక్లరేషన్ విధానంతో వెనుకబడిన తరగతులకు ప్రయోజనం కల్పించే వ్యూహాలను రూపొందించాలని యోచిస్తున్నాము. బిసి ప్రయోజనాలు దెబ్బతినకుండా కాపువర్గానికి రిజర్వేషన్‌లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి వుంది.

గత కొద్ది సంవత్సరాలలో బిసి సమాఖ్యలో కొన్ని కార్పొరేషన్లు క్రియాశూన్యంగా వారి కేంద్ర ప్రభుత్వ నిధులను గరిష్ఠంగా వినియోగించుకోలేకపోయాయి. సమగ్ర, సమ్మిళిత అభివృద్ధి అజెండాలో భాగంగా, బిసిల కోసం ఒక ఉప-ప్రణాళిక ద్వారా చేతివృత్తుల వారు, చేనేత కార్మికులు, నేతకారులు, మత్స్యకారులు, రజకులు, గొర్రెల కాపరులు, ఇతర వెనుకబడిన తరగతుల వారి కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలుచేయాలని యోచిస్తున్నాము.

ప్రజలకు వారి వర్తక స్వభావంపై ఆధారపడుతూ విద్యుత్ పరికరాలు, చేపల పట్టే వలలు, ఇతర పనిముట్లను సమకూర్చడానికి నా ప్రభుత్వం కట్టుబడి వుంది. ప్రత్యేకించి నేతకారుల వర్గంపై దృష్టిసారించడమవుతుంది. చేనేత రంగాన్ని బలోపేతం చేసే విధంగా సాధారణ పని షెడ్లు, సంఘం భవనాలను మంజూరు చేయడమయింది. చేనేతకారుల సహకార సంఘాలకు నూలు కండె, రంగులు, రసాయనాల కొనుగోలుపై రీయింబర్స్‌మెంట్ సబ్సిడీని అందించడమవుతున్నది. నేతకారులు, ఉత్పత్తులను విక్రయించేందుకు వీలుగా నేత బజారులను నిర్మించడమయింది. వివిధ కార్యకలాపాలలో నిమగ్నమైన వెనుకబడిన తరగతుల ప్రజలందరికీ నైపుణ్యాలలో శిక్షణను ఇవ్వడమవుతుంది.

మైనారిటీల సంక్షేమ అభివృద్ధి మా ప్రధాన సంక్షేమ అజెండాలోనే ఉన్నది. వాగ్దానం చేసినట్లుగా, మక్కన్-మకాన్, రోష్ని, షాదిఖానా వంటి అన్ని కార్యక్రమాలను అమలు చేయడమవుతుంది. ఇమామ్‌లు, మౌజిన్లకు గౌరవ వేతనాన్ని ప్రవేశపెట్టే అంశం ఆలోచనలో వుంది. రాష్ట్ర ఆర్థిక సంస్థ సబ్సిడీగా ప్రతిపాదించిన ఆర్థిక సహాయాన్ని బ్యాంకుల పరపతి అంశానికి అనుసంధానం చేయాలని కార్యక్రమాన్ని రూపొందించడమయింది. వివిధ "మైనారిటీల ట్యూషన్ ఫీజు" మరియు రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీజు పథకాల క్రింద లక్ష కంటే ఎక్కువ మంది మైనారిటీ విద్యార్థులు లబ్దిపొందుతున్నారు.

సామాజిక సమీకరణ, సామాజిక సాధికారత, సామర్థ్యం పెంపు అంశాల ద్వారా ఒకప్పుడు ప్రపంచ విజయగాథగా వున్నట్టి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాలు, డ్వాక్రా బృందాలు పేదరిక నిర్మూలన విధానంలో కీలకంగా మారాయి. రాష్ట్రం యొక్క ఆర్థిక ప్రగతిలో క్రియాశీలక భాగస్వాములుగా వుండటానికి మరొకమారు బృందాలకు సాధికారతను కల్పించాలనేది నా ప్రభుత్వ వ్యూహంగా వుంటుంది. నా ప్రభుత్వం రూ. 10,000/-లు మరియు దానిపై వడ్డీ మేరకు డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేయడానికి కట్టుబడి వున్నది.

ఈ బృందాలు ఆర్థికపరమైన వాటిలో పాల్గొనడానికి మరియు వ్యూహాత్మకంగా దారిద్ర్యాన్ని తగ్గించడానికి వీలుగా డ్వాక్రా మహిళలకు ధాన్యాన్ని సేకరించడం మరియు ఇసుక త్రవ్వకం వంటి కార్యకలాపాలను నా ప్రభుత్వం కల్పించింది.

నా ప్రభుత్వం సమీప భవిష్యత్తులో ఈ బృందాలకు సహాయ ప్యాకేజీని ప్రకటిస్తుంది. ఇసుక త్రవ్వకాలలో డ్వాక్రా బృందాలకు ప్రమేయం కల్పిస్తూ తీసుకున్న చర్య మాఫియా ప్రభావం నుండి క్వారీలను రక్షించడంలోను, అంతేగాక, మహిళలకు ఆర్థికంగా సాధికారతను కల్పించడంలో ఫలితాలను ఇస్తుంది.

మూడు సంవత్సరాల వయస్సు లోపు గల పిల్లలు, గర్భిణీ మహిళల కోసం పౌష్టికాహార అంశాలను పరిశీలించడానికి 3 అధిక భారం గల జిల్లాల కోసం, 2,415 పౌష్టికాహార కౌన్సిలర్-కం-అదనపు అంగన్‌వాడి వర్కర్ పదవులను, 6,432 లింక్ వర్కర్ల పదవులను నా ప్రభుత్వం మంజూరు చేసింది. పునర్ వ్యవస్థీకరించబడిన ఐసిడిఎస్ పథకాల క్రింద, 3535 అంగన్ వాడి కేంద్రం భవనాలను నా ప్రభుత్వం మంజూరు చేసింది.

మాతృ మరణాల రేటు (ఎంఎంఆర్) మరియు శిశు మరణాల రేటు (ఐఎంఆర్) ను తగ్గించడానికి, శిశువులు ఆరోగ్యకర పెరుగుదలను సాధించేలా చూసే మా చర్యలలో భాగంగా 3.45 లక్షల మంది గర్భిణీ, పాలిచ్చు తల్లులకు రోజులో ఒక పూర్తి భోజనాన్ని మా ప్రభుత్వం సమకూర్చింది. వివిధ పథకాల క్రింద గుర్తించిన 90,000 మందికి పైగా పోషకాహార లోపం గల పిల్లలను ప్రత్యేక సంరక్షణ, పర్యవేక్షక పూర్వక ఆహారాన్ని అందించే "గోరు ముద్దలు" పథకం క్రిందకు తీసుకొనిరావడమయింది.

నా ప్రభుత్వం ఈ సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుండి కిలో ఒక్కింటికి రూ. 1/- చొప్పున ప్రతి తెల్లకార్డుదారుకు 5 కిలోల చొప్పున బియ్యాన్ని అందించాలని నిర్ణయించిందని ప్రకటించినందుకు నాకు సంతోషంగా వుంది.

మహిళ రక్షణ మరియు భద్రత నా ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యతా అంశాలలో ఒకటిగా వుంది. సాంఘిక దురాచారాల నుండి మహిళలను రక్షించడానికి, తద్వారా వారికి సురక్షితమైన పర్యావరణాన్ని కల్పించడానికి తీసుకున్న వివిధ చర్యల క్రింద నా ప్రభుత్వం రాష్ట్రంలోని 13 జిల్లాలలో ఒక్కొక్క దానికి ఒక మహిళా డిప్యూటీ పోలీసు సూపరింటెండెంటును నియమించేటట్లు చూసింది.

మహిళా సంబంధ అంశాలను మరింత సమగ్రంగా పరిష్కరించే దృష్ట్యా, నా ప్రభుత్వం జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్ కోసం ఒక సముచిత సంస్థాగత యంత్రాంగాన్ని రూపొందించడానికి పనిచేస్తున్నది. మన రాష్ట్రంలో మహిళలకు రక్షణ, భద్రత కల్పించడం కోసం పోలీసు స్టేషన్లలో సిసి టీవిని ఏర్పాటుచేయడం, పట్టణ ప్రాంతాలలో ఐ-క్లిక్, అభయం, సిసి టీవి నెట్‌వర్క్‌డ్ కవరేజి వంటి క్రొత్త చర్యలను చేపట్టడమయింది.

2020 నాటికి అందరికీ గృహాలు అనే కేంద్ర ప్రభుత్వం యొక్క ధృక్పథానికి అనుగుణంగా మా ప్రభుత్వం అర్హులయినవారందరికీ గృహాలను సమకూర్చాలని కూడా ఉద్దేశిస్తున్నది. 2014-15 ఆర్థిక సంవత్సర కాలంలో 67,490 గృహాలను పూర్తి చేయడమయింది.

గత కొన్ని సంవత్సరాలలో అవినీతి పద్ధతులు చోటుచేసుకున్నాయి. అనుచిత పద్ధతుల ద్వారా గృహాలను కేటాయించడమయింది. అర్హులయినవారు వారి ప్రయోజనాలను పొందేటట్లు చూడాలనే ఉద్దేశంతో మా ప్రభుత్వం నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సహాయంతో గృహాలకు భూ సంబంధిత గుర్తింపును అనుబంధించడాన్ని చేపట్టింది. 2004-14 సంవత్సరాల కాలంలో నిర్మించిన 36.82 లక్షల గృహాల లక్ష్యానికిగాను

ఇప్పటివరకు 25.80 లక్షల గృహాలకు భూ సంబంధిత గుర్తింపును అనుబంధించడమయింది. 33.08 లక్షల గృహాల కోసం ఆధార్ సమాచారం అనుసంధానాన్ని పూర్తి చేయడమయింది.

"అందరికీ విద్యుత్తు" కార్యక్రమం అమలు కోసం దేశంలో ఎంపిక చేసిన మూడు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటని ఈ సభకు తెలియజేస్తున్నందుకు సంతోషిస్తున్నాను. గృహసంబంధ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగదారు లందరికీ 24X7 నాణ్యమైన, విశ్వసించదగ్గ, భరించదగ్గ విద్యుత్తును సరఫరా చేయడానికి, అంతేగాక రైతులకు 7 గంటల నిరంతరాయ సరఫరా వుండేలా చూడటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి వుంది. ఆంధ్రప్రదేశ్ డిస్కంలు 2015-16 సంవత్సరానికి సరిపడ విద్యుత్తు కోసం ఇదివరకే ఒప్పందాలను కుదుర్చుకున్నాయి.

నా ప్రభుత్వం పునర్వినియోగ ఇంధనానికి, ప్రత్యేకంగా సౌర మరియు పవన విద్యుత్‌కు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నది. 2015-16 సంవత్సరంలో పవన మరియు సౌర విద్యుత్తును గణనీయ పరిమాణంలో చేర్చాలని ప్రతిపాదించడమయింది. ఒక్కొక్కటి 1000 ఎండబ్ల్యు సామర్థ్యంగల రెండు అల్ట్రామెగా సోలార్ పార్కులను వరుసగా అనంతపురము మరియు

కర్నూలులలో జాతీయ థర్మల్ విద్యుత్ కార్పొరేషన్ విద్యుత్ వ్యాపార నిగం లిమిటెడ్ (ఎన్‌వివిఎన్) ఏర్పాటు చేస్తున్నది. 2015-16లో రైతులకు 10,000 సోలార్ పంప్ సెట్లను సమకూర్చాలని కూడా ప్రతిపాదించడమయింది.

నా ప్రభుత్వం అనుసరించిన ఇంధన పరిరక్షణ, సమర్థవంతమైన చర్యలు భారీ ఎత్తున దోహదపడతాయి. రాష్ట్రంలో అన్ని గృహ సంబంధ ప్రకాశించే బల్బుల స్థానంలో ఇంధన సామర్థ్యంగల ఎల్ఇడి బల్బులను అమర్చడమవుతున్నది.

నా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ కార్పొరేషన్లు మరియు మునిసిపాలిటీలలో ప్రస్తుతమున్న 25 శాతం నుండి 33 శాతానికి హరిత పరిధిని పెంచడానికి, అంతేగాక ఇంధన సామర్థ్యాన్ని మరియు పర్యావరణ అనుకూలంగా హరిత భవన నిర్మాణాలను ప్రోత్సహించడానికి చర్యలను తీసుకుంటున్నది. తదనుసారంగా, మేము 2012, ఆంధ్రప్రదేశ్ భవన నియమావళిని సవరించాం.

నా ప్రభుత్వం ఓడరేవు ఆధారిత అభివృద్ధి విధానాన్ని రూపొందిస్తున్నది. పొడవైన తీర ప్రాంతం రాష్ట్ర సుసంపన్నతకు

సింహద్వారంగా మారుతుంది. ప్రభుత్వం రోడ్డు మరియు రైలు నెట్ వర్క్ ద్వారా ఓడరేవుకు ఎగుమతులను అందించే ప్రాంతంతో ఓడరేవులను అనుసంధానం చేయడమవుతుంది. దేశీయ మరియు తీర ప్రాంత జల మార్గాలను ప్రధాన రవాణా మార్గాలుగా అభివృద్ధి చేయడమవుతుంది. ఆంధ్రప్రదేశ్‌ను ఆగ్నేయ ఆసియాకు వ్యూహాత్మక కేంద్రంగా మరియు సింహ ద్వారంగా చేయడమవుతుంది. 2015-16లో రాష్ట్రంలో నాలుగు కొత్త ఓడరేవులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది.

6 నోఫ్రిల్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయడం మరియు తిరుపతి, విజయవాడ మరియు రాజమండ్రిల వద్ద ప్రస్తుతమున్న 3 విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయికి ఆధునీకరించడం తోపాటు విశాఖపట్టణం సమీపాన బోగపురం వద్ద ఒక గ్రీన్ ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించడమయింది.

నా ప్రభుత్వం గెయిల్ ఇండియా, జిడిఎఫ్ సూజ్ మరియు షెల్‌ల సహకారంతో కాకినాడ వద్ద ఒక ఫ్లోటింగ్ స్టోరేజ్ రీ-గ్యాసిఫికేషన్ యూనిట్ ఎల్‌ఎన్‌జి టెర్మినల్‌ను కూడా ఏర్పాటుచేస్తున్నది. ఆంధ్రప్రదేశ్ గ్యాస్ అభివృద్ధి సంస్థ కాకినాడ నుండి శ్రీకాకుళం

వరకు తుంకూర్ నుండి తిరుపతి వరకు గ్యాస్ పైప్ లైన్లను మరియు మరో పైపు లైన్‌ను విజయవాడ నుండి నెల్లూరు వరకు వేస్తున్నది. కాలక్రమంలో ప్రతి ఒక్క కుటుంబానికి గ్యాస్ పైప్ లైన్‌ను విస్తరించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నది.

ప్రపంచ వ్యాప్త పోటీతత్వం మరియు బాధ్యతాయుత పారిశ్రామిక హబ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే తమ నిబద్ధతకు గుర్తుగా పెట్టుబడులకు ఒక పోటీతత్వ గమ్యస్థానంగా తయారుచేయడానికి రాష్ట్రంలో వ్యాపారాన్ని చేయడంలో సరళత్వాన్ని పెంచడానికి ఇ-బిజ్ క్రింద ఒక సింగిల్ డెస్క్ క్లియరెన్స్ వ్యవస్థను ప్రవేశపెట్టాము. ఈ వ్యవస్థ క్రింద అవసరమైన అనుమతులను మరియు ఆమోదాలను 21 రోజులలో ఇవ్వడమవుతుంది. పెట్టుబడిదారులు మరియు పరిశ్రమలకు పటిష్ఠవంతమైన సేవల బట్వాడా కోసం ఒక ఒన్-స్టాప్-షాప్‌గా సేవలు అందించడానికి జి-2-బి (గవర్నమెంట్-టు-బిజినెస్) ఇంటర్‌ఫేజ్/పోర్టల్‌ను ఇ-బిజ్ ప్రాజెక్టు ఉద్దేశిస్తున్నది. సులువైన కార్య విధానాల ద్వారా మరియు అనవసరమైన చట్టాలను మరియు నియమాలను తొలగిస్తూ వ్యాపారం చేయడాన్ని సులభతరం చేయడంపై కూడా పనిచేస్తున్నాం.

భారీ సామూహిక కేంద్రాలు, అంతర్జాతీయ పాఠశాలలు, క్రీడా సౌదాలు మరియు గోల్ఫ్ కోర్సులతోపాటు రాష్ట్రంలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం మిక్కిలి శ్రద్ధతో వుంది. జపాన్ నుండి చాలా కంపెనీలు రాష్ట్రాన్ని సందర్శించడం ప్రారంభించాయి.

చిత్తూరు జిల్లాలోని మెగా ఫుడ్ పార్క్, భీమవరం సమీపంలో మెగా ఆక్వా ఫుడ్ పార్క్, గుంటూరు జిల్లాలోని మెగా వీవర్స్ క్లస్టర్‌కు సంబంధించిన పనులు పురోగతిలో వున్నాయి. పారిశ్రామికాభివృద్ధి, ఉపాధికల్పన కోసం జిల్లా వారీ విధానంలో భాగంగా మెగా అగ్రికల్చర్ ఫుడ్ పార్కులు, ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ పార్కులు, చిన్నతరహా ఓడరేవులు, దేశీయ విమానయాన టెర్మినల్స్, టెక్స్‌టైల్ పార్కులు, ఆక్వా మరియు ప్రాసెసింగ్ యూనిట్లను ప్రతిపాదించడమయింది.

ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకుల కోసం అనేక సదుపాయాలు, సౌకర్యాలతో మరింత అందుబాటులో మరింత ఆకర్షణీయంగా గమ్యస్థానాలను తీర్చిదిద్దుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రయాణ, పర్యాటక రంగంలో స్థిర, సుస్థిర వృద్ధిని పెంపొందించడం ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగం దార్శనికతగా వుంది. ఎక్కువమంది

పర్యాటకులను ఆకర్షించడానికి పలు పర్యాటక సర్క్యూట్ల ఏర్పాటుకు ప్రణాళిక జరుగుతున్నది.

విజయవాడ దగ్గర నవ్యాంధ్రప్రదేశ్ కోసం ఒక ప్రపంచ శ్రేణి రాజధానిని నిర్మించాలనే మా ప్రభుత్వ నిర్ణయం వేగవంతం చేయడమవుతున్నది. నూతన రాజధాని నగరం దేశంలోనే ఒక ఆదర్శవంతమైన రాష్ట్రంగా ఉంటుందని ఆశిస్తున్నాను. నూతన రాజధాని మాస్టర్ ప్రణాళిక మొదటి దశ 2015, జూన్ నాటికి పూర్తి చేయడమవుతుంది. రాజధాని ప్రాంతీయాభివృద్ధి ప్రాధికార సంస్థ (సిఆర్‌డిఏ) కు అభివృద్ధి కార్యకలాపాన్ని అప్పగించడమయింది.

భూ సమీకరణ విషయంలో దేశంలోనేకాక, బహుశా ప్రపంచంలోనే అతి పెద్ద భూ సమీకరణ చేయడం అత్యంత అహ్వానించదగిన, ఆనందించదగిన కార్యక్రమం. రాజధాని నిర్మాణంలో భాగస్వాములు కావాలని అంగీకరించిన ఉత్సాహవంతులైన వ్యవసాయ భూముల యజమానులు దాదాపు 33,000 ఎకరాల భూమిని స్వచ్ఛందగా ఇచ్చారు.

యుఎస్ ప్రభుత్వం విశాఖపట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్ధి పర్చడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం

కుదుర్చుకుంది. ఆలోచనలు కార్యరూపం దాల్చటానికి ఈ అవగాహనా ఒప్పందం ప్రకారం సాధ్యాసాధ్యత అధ్యయనాలు, అధ్యయన పర్యటనలు, వర్క్ షాప్‌లు కోసం యుఎస్ ప్రభుత్వం నిధులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుతుంది.

ప్రపంచంలో ఎక్కడైనా లభ్యంగావున్న మెరుగైన నైపుణ్యాన్ని వినియోగించాలనేది మా ప్రయత్నం. నా ప్రభుత్వం పెట్టుబడులు, సాంకేతిక విజ్ఞానం బదిలీ కోసం జపాన్, సింగపూర్, యుఎస్ఎ, ఆస్ట్రేలియా మరియు ఇతర దేశాలలోని ప్రభుత్వాలు, కంపెనీలు, పిఎస్‌యులతో క్రియాశీలకంగా సంప్రదిస్తున్నది. చేపల పెంపకం, పాడి పరిశ్రమ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో పనిచేయటానికి ఆస్ట్రేలియా ఆసక్తితో ఉంది.

అవసరమైన పరిపాలన సంస్కరణలు, అవినీతిరహిత పరిపాలన అందించడానికి నా ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. గత కొన్ని సంవత్సరాలలో ప్రభుత్వంలో నెలకొనివున్న అవినీతిని పరిశీలించడానికి మేము మంత్రిమండలి ఉపసంఘాన్ని నియమించాము. లఘు ప్రభుత్వం, అధిక పరిపాలన సూత్రాన్ని వాస్తవం చేయడానికి అవినీతి లేని మరియు మంచి పరిపాలన సాంప్రదాయాలను వ్యవస్థీకృతం చేయడానికి నా ప్రభుత్వం వ్యూహాలు రచిస్తున్నది.

అన్ని టెక్నాలజీల అభివృద్ధి ఒక ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన సొసైటీని ఏర్పాటుచేయటానికి దోహదపడుతుంది. నా ప్రభుత్వం టెక్నాలజీని వినియోగిస్తూ సంక్షేమ కార్యక్రమాలలో ఒక నూతన పారదర్శకత విధానాన్ని నెలకొల్పటంపై దృష్టి సారించింది. పింఛన్ మున్నగువంటి ప్రయోజనాల బట్వాడాకు సంబంధించిన సమాచారాన్ని సంక్షేమ పింఛన్ల లబ్ధిదారులు ఇప్పుడు వారి యొక్క మొబైల్ ఫోన్ల ద్వారా పొందుతున్నారు. సుపరిపాలనను తీసుకురావడంలో ఇ-గవర్నెన్స్ ప్రధాన చర్యగా ఉంది. అర్హతగల వ్యక్తులకు నిర్దేశించిన ప్రయోజనాలను సకాలంలో బట్వాడా చేసేలా చూడటానికి నూటికి నూరు శాతం ఆధార్ ఆధారిత విధానం రాష్ట్రంలోని బట్వాడా వ్యవస్థకు కీలకం కానున్నది. ఇ-గవర్నెన్స్ దృక్కోణాన్ని సాకారం చేసుకోవటానికి, పటిష్టవంతమైన సేవల బట్వాడా కోసం టెక్నాలజీని వినియోగించుకోవటానికి రాష్ట్ర ఎంటర్ ప్రైజెస్ ఆర్కిటెక్చర్‌ను నెలకొల్పుతున్నాం.

జాతీయ ఐటి ఎగుమతులలో 5 శాతం వాటాను సాధించాలని మా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పాలసీ లక్ష్యంగా ఉంది. రెండు ఐటిఐఆర్‌ల అభివృద్ధి, 10 ఐటి హబ్‌ల అభివృద్ధి, 20 మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, అయిదు లక్షల ఉద్యోగాల ఏర్పాటుపై దృష్టి పెట్టడమవుతుంది. నూతన ఐటి విధానం ప్రతి గృహ పరివారానికి బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటిని సమకూర్చాలని ఉద్దేశిస్తున్నది.

నైపుణ్యం కలిగిన, నైపుణ్యంలేని కార్మికులు ఇద్దరికీ ఉపాధిని కల్పించడానికి నా ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఉద్యోగాలు కల్పించడానికి సంబంధించి ఉపాధ్యాయులు, ఇతర పదవులను భర్తీ చేయడానికి మాకు ప్రణాళికలు ఉన్నాయి. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడానికి, పరిశ్రమలు నెలకొల్పడానికి నా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. ప్రైవేటు రంగంలో ఉపాధిని కల్పిస్తున్నది. గరిష్ఠంగా ఉపాధిని కల్పించే లక్ష్యంతో వివిధ రంగాలలోని నిరుద్యోగులకు అవసరమైన నైపుణ్యాలను కల్పించడమవుతుంది.

రానున్న సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌ను మౌలిక వసతుల కేంద్రంగా అభివృద్ధి చేసే ఒక కార్యక్రమాన్ని నా ప్రభుత్వం చేపట్టింది. నవీకరణ, స్టార్ట్-అప్ విధానం ద్వారా ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారుచేసే అనుకూల వ్యవస్థను సృష్టించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం యొక్క డిజిటల్ ఇండియా ప్రారంభం ఆలోచన మేరకు కనీసం ఒక దేశీయ తయారీ "బిలియన్ డాలర్ టెక్నాలజీ" స్టార్ట్-అప్‌ను ఏర్పాటుచేయడం మా లక్ష్యంగా ఉన్నది.

ప్రపంచ బ్యాంకు మద్దతుతో భూగర్భ వైరింగ్, ఇతర మౌలిక సౌకర్యాల పనులను కల్పిస్తూ హుద్‌హుద్ ప్రభావిత ప్రాంతాలను తుఫాన్ అబేధ్య ప్రాంతాలుగా చేయడానికి నా ప్రభుత్వం ప్రణాళిక చేస్తున్నది. ఈ ప్రభావిత ప్రాంతాలలో పునర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. హుద్‌హుద్ తుఫానులో 11 అమెరికన్ బిలియన్ డాలర్ల నష్టం జరిగిందని ఐక్యరాజ్య సమితి నివేదిక తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం చూపిన నిబద్ధతను, సకాలంలో చేపట్టిన సహాయక కార్యక్రమాలను ప్రశంసించింది. అనేక మంది ప్రాణాలను కాపాడినట్టి విపత్తు సన్నద్ధతను, సకాలంలో తరలింపును ప్రశంసించింది. నష్టం మరియు అవసరాల అంచనాను దృష్టిలో ఉంచుకొని, నష్టం పునర్‌నిర్మాణం, ఉపశమనం, విపత్తు ప్రమాదాన్ని తగ్గించడానికి 250 అమెరికన్ మిలియన్ డాలర్ల ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయం ద్వారా ఒక నూతన విపత్తు ఉపశమన ప్రాజెక్టుల మద్దతును ఆర్థిక వ్యవహారాల శాఖను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరింది.

వ్యక్తుల ఆయుర్దాయం, పనిచేసే సామర్థ్యం పెరగడాన్ని పరిగణనలోనికి తీసుకుంటూ నా ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును రెండు సంవత్సరాలు అంటే 58 సంవత్సరాల నుండి 60 సంవత్సరాలకు పెంచింది. ఈ నిర్ణయంతో

పరిపాలన దక్షులైన ప్రభుత్వ ఉద్యోగులు మరో రెండు సంవత్సరాలు ప్రజలకు సేవ చేయడంలో తమ అనుభవాన్ని పంచే అవకాశాన్ని కలిగివుంటారు. ఉత్తమ సేవ అందించడానికి, వారిని ప్రేరేపించడం కోసం వారిని ఇంకా సంతోషంగా వుంచడానికిగ్గాను 2014, జూన్ 2 నుండి అమలులోకి వచ్చే విధంగా మూలవేతనంలో 43 శాతం ఫిట్‌మెంట్ అసాధారణ పెంపుతో 10వ వేతన సవరణ సంఘం సిఫార్సులను అమలుచేయాలని నా ప్రభుత్వం ప్రకటించింది. సమాజంలో ఉద్యోగులు ముఖ్య భాగమై ఉన్నారు. రాష్ట్ర విభజన సమయంలో ఐక్యత కోసం చూపిన వారి చక్కని నిబద్ధతను దృష్టిలో వుంచుకొని సమైక్య ఆంధ్ర ఉద్యమంలో ఉద్యోగులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని నా ప్రభుత్వం నిర్ణయించింది. సమ్మె కాలాన్ని ప్రత్యేక అవసర సెలవుగా పరిగణిస్తూ, ప్రభుత్వ ఉద్యోగులకు నిలిపివుంచిన జీతాలను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తరువులు జారీ చేసింది. ఉద్యోగుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవడానికిగాను ఆరోగ్య కార్డులను జారీ చేయడం కూడా జరుగుతున్నది. పత్రికా విలేకరులకు కూడా ఆరోగ్య కార్డులను జారీ చేయడమయింది.

సమైక్య ఆంధ్ర ఉద్యమ కాలంలో రాష్ట్రాన్ని ఐక్యంగా వుంచడం కోసం ఆందోళన చేసిన ప్రజలపై నమోదుచేసిన కేసులన్నింటినీ

రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా ఎత్తివేసింది. రైల్వే వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు నమోదు చేసిన కొన్ని కేసులను ఉపసంహరించుకునే ప్రక్రియ జరుగుతున్నది.

సాంప్రదాయాలను గౌరవించడం, ప్రకృతికి దగ్గరగా జీవించడం ఈ నేల ప్రామాణిక చిహ్నంగా ఉన్నది. నదిని తల్లిగా భావించే సంస్కృతి మనది. ముఖ్యంగా పుష్కరం అంటే మాతృనదిని పూజించడం. గోదావరి పుష్కరాలను గొప్పగా నిర్వహించే క్రమంలో పుష్కరాలను పెద్ద ఎత్తున నిర్వహించే పట్టణాలలో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను ఆధునీకరించే అనేక పనులను, అదేవిధంగా అదనపు సౌకర్యాలను కల్పించడాన్ని నా ప్రభుత్వం చేపట్టింది. కులం, జాతి, మతంతో సంబంధం లేకుండా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి ప్రాచీన మనోభావాలను గౌరవించడానికి నా ప్రభుత్వం నిబద్ధత కలిగివుంది.

2015, జనవరిలో సంక్రాంతి సందర్భంగా, రూ. 286 కోట్ల ఖర్చుతో తెల్లరేషన్ కార్డు దారులందరికి 6 నిత్యావసర సరుకులతోకూడిన "చంద్రన్న సంక్రాంతి కానుక" అనిపిలిచే రూ. 240 విలువైన "ఉచిత ప్యాకేజి" ని నా ప్రభుత్వం అందించింది.

ఎన్టిఆర్ ఆరోగ్యసేవ క్రింద చికిత్స వ్యయపరిమితిని రూ. 2.5 లక్షలకు పెంచింది. దానికితోడు, కొత్తగా 100 వ్యాధులకు వర్తింపచేసే ఈ పథకంలో వ్యాధుల సంఖ్యను 1038కి పెంచడమయింది. ప్రాథమిక ఆరోగ్య రక్షణను పటిష్టపరచడానికి ప్రభుత్వం నిబద్ధత కలిగివున్నది.

ప్రాథమిక విద్యా కార్యక్రమాన్ని సార్వత్రీకరించే దానిలో భాగంగా "బడి పిలుస్తోంది" కార్యక్రమం క్రింద 6.33 లక్షలకు పైగా బాలలు 1వ తరగతిలో చేరారు. "పాఠశాలలో చేరని" 31,286 మందిలో 25,923 మందిని పాఠశాలలో చేర్చడమయింది.

అదనంగా, ఉత్తమ జీవనాధార అవకాశాలు పొందడానికి సమాజంలో ప్రబలివున్న సామాజిక దురాచారాల అంధకారాన్ని తొలగించడానికి ఒక సాధనంగా నా ప్రభుత్వం నూటికి నూరు శాతం అక్షరాస్యతకు కృషిచేస్తుంది. దీనికి విద్య అత్యంత ధీటైనదని మేము కూడా గట్టిగా విశ్వసిస్తున్నాం.

నా ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన సామాజిక సాధికారత మిషన్ క్రింద ఉన్నత విద్యారంగంలో ప్రమాణాలను రూపొందించాలని రాష్ట్రం యోచిస్తున్నది. ఉద్యోగ అవకాశాలను పెంచడానికి మా నిబద్ధతను ప్రతిబింబిస్తూ విజయవాడలో మేము నైపుణ్య అభివృద్ధి

కేంద్రాన్ని ఏర్పాటుచేశాం. నైపుణ్య కార్యక్రమంలో భాగంగా అది సంపన్నమయిన సామర్థ్యాలను విశదీకరించడానికి ప్రయత్నిస్తుంది. విశాఖపట్టణం వద్ద ఐఐఎం ఏర్పాటు అనే వాస్తవంతో, కేంద్రం వాగ్దానం చేసిన అన్ని ఇతర ఉన్నత విద్యా సంస్థలన్ని త్వరలో ప్రారంభించబడతాయని నేను చాలా ఆశాభావంతో ఉన్నాను. యువత ప్రత్యేకించి మహిళా సాధికారత అందించే క్రమంలో విద్య నాణ్యతను మెరుగుపరచడానికి నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టడమవుతుంది. ఆంధ్రప్రదేశ్ త్వరలో విద్యా రాష్ట్రంగా మరియు విద్యా కేంద్రంగా రూపొందుతుంది.

సంక్షేమం, అభివృద్ధికి మేము ప్రాధాన్యతనిస్తూ పౌరుల రక్షణ, భద్రతకు నా ప్రభుత్వం తగినంత శ్రద్ధ వహిస్తుంది. సాంకేతిక విజ్ఞానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పోలీస్‌లో పరివర్తన ప్రక్రియను ప్రారంభించడమయింది.

నా ప్రభుత్వ కీలక అంశం సహజ వనరుల రక్షణ. మా ప్రయత్నంగా అక్రమ రవాణా మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు స్వస్థి చెప్పడానికి, ప్రత్యేక యూనిట్ అంటే ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌ను నా

ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ యూనిటు ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో కృషిచేస్తుంది. ఎర్రచందనం అక్రమ రవాణాదారులను అరికట్టడంలో ధృఢనిశ్చయం, వ్యవస్థీకృత పనితీరు సానుకూల ఫలితాలనిచ్చింది. ఇసుక, ముగ్గురాయి వంటి ఇతర సహజ వనరులను రక్షించడానికి ఇదేవిధమైన కృషి జరపడమవుతున్నది.

శాంతి భద్రతలను కాపాడే నిమిత్తం నా ప్రభుత్వం ప్రస్తుతం వున్న చట్టాలను సమర్ధవంతంగా అమలుపరచి, నిఘాను పటిష్టపరుస్తుంది.

మొత్తం మీద విభజన అనంతర కాలంలోని గతకొన్ని నెలలు, రాష్ట్రానికి మరియు మన దేశానికి చారిత్రాత్మక కాలమైనది. ఆశాజనకంగా ఉన్న ఆర్థిక వృద్ధి అనేక అభివృద్ధి కార్యక్రమాల అమలు మరియు సంక్షేమ కార్యక్రమాలు ఇందుకు సాక్ష్యంగా ఉన్నాయి. ఈ పోటీ కాలంలో మేము నిర్విరామంగా పనిచేసి ఉత్తమ సానుకూల ఫలితాలను సాధిస్తాం.

గత కొద్ది సంవత్సరాలుగా నిర్దిష్టమైన చర్యలేకపోవడం మూలంగా బలహీనపడటమేకాకుండా అతికొద్దిపాటి వనరులతో, దుర్భలమైన ఆదాయానికి మించిన వ్యయంతో అవశేష ఆంధ్రప్రదేశ్‌గా విభజన ద్వారా ప్రతికూల ప్రభావం వల్ల కూడా అభివృద్ధిలో కుంటుపడిన రాష్ట్ర పునర్ నిర్మాణం కోసం కుల, మతాలతో సంబంధం లేకుండా రాజకీయపార్టీలకు అతీతంగా కష్టపడి పనిచేసే, పారిశ్రామిక, జ్ఞానం మరియు నిపుణులైన ఈ రాష్ట్రంలోని నా ప్రియమైన ప్రజానీకానికంతటకీ ఈ క్లిష్ట సమయంలో ముందుకు రావలసిందిగా కోరుతున్నాను. మన రాజధాని నగర నిర్మాణ మహత్తర కార్యం కోసం ప్రభుత్వంపై విశ్వాసం ఉంచి ఇష్టపూర్వకంగా, స్వచ్ఛందంగా వారి భూములను ఇవ్వడానికి ముందుకు వచ్చిన ప్రజలందరికీ నా అత్యుత్తమ ప్రశంసను తెలియజేస్తున్నాను. ఈ చారిత్రక కార్యం కోసం వారి నిబద్ధతను రాబోవు తరాలు గుర్తుంచుకుంటాయి.

సుస్థిర ప్రాతిపదికపై ఫలితాలను సాధించేందుకు రాష్ట్రం తరఫున అపరిమిత ప్రయత్నాలు చేయడమేకాకుండా కేంద్ర ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అవసరమవుతాయి. ఇప్పటివరకు తీసుకున్న చిన్నపాటి చర్యలన్నింటికీ, అదనంగా కేంద్రం పెద్ద ఎత్తున రాష్ట్రాన్ని కాపాడేందుకు ముందుకు వచ్చి

మన అభివృద్ధి విజన్‌లో విజయం సాధించేందుకు సహాయ పడుతుందని మేము ఆశిస్తున్నాం. ప్రస్తుత శాసనసభ సమావేశాలలో ఈ అంశాలపై ప్రయోజనాత్మక చర్చ జరపాలని అన్ని రాజకీయ పార్టీలను కూడా కోరుతున్నాను.

**జైహింద్**

Printed by the Commissioner of Printing, at A.P. Legislative Assembly Printing Press,
Hyderabad, 2015.